


నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల

# 'కొడవటిగంటి వంటి సాహితీ చందమామ'

1978 మార్చి యువ మాస పత్రికలో ప్రచురింపబడిన గల్పిక

## 'విప్లవ మేధావి'

రచన: కొడవటిగంటి కుటుంబరావు



సాయుధ విప్లవం ద్వారా తప్ప దేశానికి విముక్తి లేదని అందరు మార్క్సిష్టులూ నమ్మినట్టే గణాచారి కూడా నమ్మాడు. సిద్ధాంత సాహిత్యమంతా కంఠస్థం చేశాడు.

అట్టడుగు వర్గాలలో రాజకీయ చైతన్యం (విప్లవ చైతన్యం దాకా పోకుండానే) అంతగా లేదని గణాచారి అనుయాయులు భావించారు. గణాచారికి తుపాకీ పట్టి బూర్జువా పెట్టుబడిదారీ తైనాతీలనందరినీ కాల్చిపారేయాలని వున్నా, తనకు ఆ శక్తి లేదని అతనికీ తెలుసు.

అందుచేత ఏం చెయ్యాలి? ప్రజలలో విప్లవ బీజాలు నాటి, విప్లవోత్సాహం రేకెత్తించే సారస్వతం సృష్టించాలి. ఆ సారస్వతం అక్కడక్కడా ఉన్న విప్లవకారులకి ఎంతో సహాయగా వుంటుంది.

సారస్వత కార్యక్రమం సాగింది. అందులో గణాచారి విశిష్ట పాత్ర వహించాడు. తన రచనలు తాను మళ్ళీ మళ్ళీ చదువుతుంటే విప్లవావశ్యకత ప్రజలకు అరటిపండు ఒలిచి పెట్టినట్టుగా స్పష్టమయింది. దాని నిండా లెనిన్ కొటేషన్లు, మార్క్స్ కొటేషన్లు, మావో కొటేషన్లు, కొల్లలుగా వున్నాయి. దేశీయుల కొటేషన్లు అంతగా లేవు.

గణాచారికి రోజురోజుకీ ఆవేశం హెచ్చుతున్నది. ఒక వంక విప్లవం దేశం నాలుగు చెరగులా అంటుకున్నది. విప్లవ రచనలతో ఇంక పని లేదు. అతను ఓ మంచి రోజు చూసి, నినాదాలిచ్చుకుంటూ విప్లవ స్థావరానికి బయలు దేరాడు. దురదృష్టవశాత్తూ అంతకుముందే పోలీసులు స్థావరంలో ఉన్న చంటిపిల్లల దగ్గరనించీ అందర్నీ పోలీసువాన్‌లో కుక్కి, అడవిలోకి తీసుకుపోయి, ఇంక వెళ్ళండని చెప్పి వెనకనించీ అందర్నీ కాల్చేశారు. ఎందుకంటే ఎమర్జన్సీయా, మాటలా?

గణాచారి ఆశ్చర్యపోయి, తన వెనుక వస్తున్న లక్షలాది జనం కోసం చూశాడు. ఒక్క పురుగు లేదు. క్వామేడ్లు అరణ్యంలో దాక్కోబోయారేమోనని ఇంకా ముందుకు సాగాడు. ఎదురుగా వస్తూ పోలీసువాన్ కనిపించింది!

0 0 0




'జీవితాన్ని విమర్శించటం, అలంకరించటం, సాహిత్యం చేయగల ఉత్తమ కార్యాలు. ఇదే సాహిత్యం యొక్క ఉత్కృష్ట ప్రయోజనం'

'ఏ కాలపు జీవితాన్ని విమర్శించేది ఆ కాలపు సాహిత్యం. నేటి జీవితాన్ని విమర్శించలేనిదీ, నేటి భావాలని సంస్కరించలేనిదీ, నేటి జీవితాన్ని అలంకరించలేనిదీ నేటి సాహిత్యం కాదు'

'మానవుడు చేసే సమస్త ప్రయత్నాలకూ సాహిత్యం ఎంతో తోడుగా వుంటుంది. నాగరికత పెంపొందించు కోవటానికీ, సంస్కారం అభివృద్ధి చేసుకోవటానికీ సాహిత్యం అవసరం'

'కథలు జీవితాన్ని ప్రతిబింబించటమే కాదు, వ్యాఖ్యానించాలి. పాఠకుణ్ణి రంజించటంతోబాటు, మేధస్సుని కూడా కదిలించాలి'

'ఏ రచన ఏ తరగతి పాఠకుల కోసం పుట్టిందో, ఆ తరగతి పాఠకులు దాన్ని చదవటం జరగాలి'

'కళారాధకులలో సాంఘిక చైతన్యం కలిగించటం మన విధి. జీవితం ప్రమాదభూయిష్టం కాదనీ, జీవితా నుభవం వెనుక కొన్ని సూత్రాలున్నాయనీ, వాటి సహాయంతో జీవితాన్ని అభ్యుదయ మార్గాల నడిపించ వచ్చుననీ మన రచనల ద్వారా చాటాలి'

'మానవజాతి ఎటు పోతున్నది? ఎటు పోవాలి? దారిద్ర్యమూ, అనారోగ్యమూ, సంకుచితత్వమూ, యుద్ధ భయమూ, కులతత్వాలు, మతతత్వాలు, ఇటువంటి సాంఘిక పీడలు నిర్మూలమై ప్రజలు స్వేచ్ఛగా, అవాంతరాలు లేకుండా, విభేధాలు పోగొట్టుకుని, తమ ఆర్థిక, వైజ్ఞానిక, విజ్ఞాన, నైతిక జీవితాలను గట్టి పునాది మీద నిర్మించు కోవడానికి మార్గమేది? కథకులు కూడా ఈ సమస్యలకు ఎడంగా నిలబడివుండలేరు. ఇటువంటి ప్రశ్నలకు వీరు సరైన సమాధానం తెలుసుకునే కొద్దీ కథలు జీవితానికి మరింత సన్నిహితంగా వచ్చి జీవిత సత్యాన్ని చిత్రించగలుగుతాయి'

'కొందరు రచయితలు (కథకులు కూడా) సాహిత్యాన్ని మేజువాణీ ఆడుకుంటున్నట్టు కనిపిస్తుంది. ఫలాని ప్రణయ కథలు రాస్తే రసజ్ఞ లోకం సంతోషిస్తుందనో, ఫలాని సెక్సు కథలు రాస్తే నాలుగు డబ్బులు వస్తాయనో గజ్జె కట్టి మేజువాణీ చెయ్యటం హేయం. 'హా, ఎంత గొప్ప కథకుడు!' అనిపించుకోవటనికో, 'ఏం మనస్థత్వ పరిశీలన!' అనిపించుకోటానికో రచన చేయటం కూడా హేయమే! మనస్థత్వ పరిశీలనా, రచనా సామర్థ్యమూ వుండాలే కానీ అవి రచనలో ప్రతిబింబించక పోవు. పని పెట్టుకుని జీవితాని లక్ష్యపెడితే తప్ప ప్రతిబింబించనిదల్లా జీవిత వాస్తవికతే!'

'శిల్పమూ, భాషా రచనకి ముఖ్యం కాదని కాదు. అవి చాల ముఖ్యం. అయితే అవి కథా రచనకి మూల పరికరాలు. ముడి పదార్థం మాత్రం జీవితం!'

ఇవన్నీ ఏరి కోరి ఎందుకు వ్రాశానంటే, ఇటు చేయి తిరిగిన రచయితలకూ, అప్పుడే రచనల్లో చేయి పెట్టిన రచయితలకూ, ఇవి కథా రచనకి పనికి వచ్చే మూల సూత్రాలు కనుక. కొడవటిగంటి కుటుంబరావుగారు మనకి అందించిన ఆయన సాహిత్య జీవిత సత్యాలు కనుక.

0 0 0

'దాదాపు యాభై యేళ్ళ కాలంలో కుటుంబరావు పది పన్నెండు వేల పేజీలకు మించిన సాహిత్యం వ్రాశారు. నాలుగు వందలకు పైగా కథలూ, దాదాపు యెనభై గల్పికలూ - దాని రూపాంతరాలైన అల్పిక, బుల్లి కథ, అభూత కల్పనలూ - ఇరవై నవలలూ, వంద దాకా రేడియో నాటికలూ, రెండు మూడు సినిమా స్క్రిప్టులూ వ్రాశారు. మౌలికంగా కథా రచయితా, నవలా రచయితా అయినప్పటికీ వివిధ అభిరుచుల వల్లా, సంగీతం, నాటికలు, సినిమాలు, సాహిత్య విమర్శ, చరిత్ర, సౌందర్య, మనస్థత్వ, ఆర్థిక, రాజకీయ, జీవ శాస్త్రాలు మొదలైన వాటితో సమకూర్చుకున్న పుష్కలమైన పరిజ్ఞాన సంపదవల్లా, దాన్ని పాఠకులతో సాటి రచయితలతో పంచుకోవాలనే - ఆర్తివల్లా, ప్రగతిశీల ఉద్యమ తత్పరతవల్లా, అన్నిటికీ మించి అలవరచుకున్న గొప్ప పాత్రికేయ గుణంవల్లా, ఆరేడు వందలవరకూ సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక వ్యాసాలూ, ఫీచర్లూ, పుస్తక సమీక్షలూ, పుస్తక పరిచయాలూ వ్రాశారు. ఎన్ని రకాల సాహిత్యం వ్రాశారో దాదాపు అలాటివన్నీ అనువదించారు. ఎందరికి ఎన్నెన్ని విషయాల మీద లేఖలు వ్రాశారో ఇంకా తేలని విషయమే!' అంటారు కేతు విశ్వనాథరెడ్డి.




'1931-1942 మధ్య వచ్చిన కుటుంబరావు రచనలు ఎక్కువగా కుటుంబ బంధుత్వ సంబంధాల, స్త్రీ పురుష సబంధాల పరంగా సాగాయి. అప్పటికే తెలుగుదేశంలో ప్రచలితంగా వున్న భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామ్య, జాతీయ భావాల ప్రభావం, సామ్యవాద భావాల స్పృహ, కుటుంబరావు రచనల్లో స్థూలంగా కనిపిస్తాయి. ప్రపంచ ఉత్తమ సాహిత్యాధ్యయనం ద్వారా సంక్రమించిన అంతర్జాతీయ తత్వం కూడా రేఖా మాత్రంగా కనిపిస్తుంది. 1930 ఆనాటి ఆర్థిక సంక్షోభం వ్యవసాయ వాణిజ్య రంగాలకిచ్చిన గట్టి కుదుపు, దాని వల్ల కలిగిన సామాజిక క్లైబ్యం, దురన్యాయాలూ; తర్వాత యుద్ధం తెచ్చిన సామాజిక సంక్షోభం, వీటి స్పృహ ఈ దశలోని రచనల్లో కనిపిస్తుంది.

ఈ దశలో ఆనాటి భారతీయ ప్రగతిశీల మేధావులందరిలాగానే కుటుంబరావు కూడా ఒక ఇంటలెక్చుయల్ గైడ్ కోసం తపించినట్టు తోస్తుంది. మార్క్స్ కాపిటల్ చదవటంతో (1942) ఆ మార్గదర్శి కుటుంబరావుకి లభించింది. భౌతిక శాస్త్ర విద్యార్థిగా, రచయితగా, ఆపాటికే అలవడిన హేతువాదం, శాస్త్రీయ దృక్పథం 'కాపిటల్' చదవటంతో మార్క్సిస్ట్ ప్రాపంచిక దృక్పథం దిశగా సాగింది. మార్క్సిస్ట్ సాహిత్యంతో, పత్రికలతో పరిచయం ఏర్పడింది. దీనితో 1942 తర్వాత వచ్చిన రచనల్లో కుటుంబ సామాజిక సంబంధాలకు ప్రాతిపదిక అయిన ఆర్థిక సంబంధాలు, వర్గాల విశ్లేషణ ప్రముఖంగా, నిశితంగా కనిపిస్తుంది. శిల్ప సమన్వితంగా సాగిన వివిధ సమస్యల విశ్లేషణ, ఆ చిత్రణ ద్వారా సంస్కారంలోకి యింకిపోయే చారిత్రక జ్ఞానం వల్ల, భౌతిక దృక్పథం వల్ల, రెండు తరాల (1940-1960) మధ్య తరగతి పాఠకుల కనువిప్పుకు కొంతయినా తోడ్పడింది' అంటారు కేతు విశ్వనాథరెడ్డి.

0 0 0

1970 దశకంలో అనుకుంటాను నేను కుటుంబరావుగారి వ్యాసం ఒకటి చదివాను. దాని పేరు గుర్తు లేదు కానీ, విషయపరంగా ఇంకా నా జ్ఞాపకాల్లో పదిలంగా వుందది. శాస్త్రీయంగా పరంగా వ్రాసిన వ్యాసం అది. కలల్లోనూ, నిజ జీవితంలోనూ వుండే కాలక్రమ తేడాలను సహేతుకంగా చర్చించిన వ్యాసం. ఆయనలోని శాస్త్రీయ పరిజ్ఞానం మనల్ని అబ్బుర పరిచే వ్యాసం.

ఆయన వ్రాసిన కథలూ నవలలూ ఎన్నో చదివాను. ఆ రోజుల్లో నాకు చదవటమే ఒక వ్యాపకం అయితే, ముఖ్యంగా ఈయన రచనలు చదవటం జీవితంలో పాఠాలు నేర్చుకోవటం లాటిది. కుటుంబరావుగారి పాత్రలు మన చుట్టుపక్కల నిత్యం కనపడేవే. అందుకనేనేమో ప్రతివాళ్ళు ఆయా పాత్రల్ని తమకు తెలిసిన ఎవరితోనో ఎప్పుడూ పోల్చుకుంటూ వుంటారు. ఆయన రచనల ప్రభావం వల్లనే, నాకూ నా చుట్టూ జరుగుతున్న సంఘటనల మీద కథలు వ్రాయటం అలవాటయింది.




0 0 0

ఆయన వ్రాసిన కథలూ, నవలలూ మొదలైనవి కొన్ని మచ్చుకగా చర్చించుదామన్నా, ఇక్కడ అవి కుదించి వ్రాయటం కష్టం. ఆయనవి ఎన్నో చక్కటి రచనలు. మరిచిపోలేని రచనలు.

తెలుగు తెలిసిన వ్యక్తిగా పుట్టి, ఆయన రచనలు చదవకపోవటం... (అదేమిటో చెప్పటం నా కిష్టం లేదు) అందుకని ఈసారి ఇండియా వెళ్ళినప్పుడు ఆయన పుస్తకాలు కొన్నయినా కొని తెచ్చుకుని, చదివి మీరంతట మీరే కుటుంబరావు సాహిత్యం అంటే ఏమిటో తెలుసుకోండి. తెలుగువాళ్ళంగా అది మన బాధ్యత. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు కుటుంబరావు సాహిత్యం అనే పేరుతో, కేతు విశ్వనాధరెడ్డి సంపాదకత్వంతో ప్రచురించారు. అవే నాకూ ఈ వ్యాస రచనకి ఆధారమయాయి. అలాగే ఈ వ్యాస రచనకి ఉపయోగ పడిన పుస్తకం వేదగిరి రాంబాబుగారి 'కథానికా లక్ష్యము - లక్షణాలు', ఇంకా నా దగ్గర వున్న ఎన్నో కుటుంబరావుగారి పుస్తకాలు.

0 0 0

కుటుంబరావుగారి సాహిత్య ప్రక్రియల్లో, ప్రయోగాల్లో చాలమందికి తెలియని విషయం ఇంకొకటి వుంది. చందమామ మాస పత్రికకి ఆయనే అనామక సంపాదకులు. ఎంతో మంది కొత్త రచయితలను పరిచయం చేయటం ఒకటే కాక, ఆ రచనలన్నీ ఒకే ఒరవడిలో వ్రాయించి, వ్రాసి చందమామ ద్వారా తెలుగుదేశమంతటా వెన్నెల కురిపించిన వ్యక్తి. పిల్లల పత్రికే అయినా, ముందు పెద్దలు చదివాకనే పిల్లలకు దొరికే పత్రిక అది. ఎన్నో తరాలవారిని ఊపిన పత్రిక. అందులో సీరియల్స్ కూడా చాల వరకూ కుటుంబరావుగారే వ్రాశేవారు. ఈనాటికీ బైండ్ చేసిన పాత చందమామలు, చాలమంది సాహితీ ప్రియుల ఇళ్ళల్లో వుండటానికి కారణమూ ఆయనే!

0 0 0

ఇలాఅన్నారు..!

అర్జునుడికి భగవద్గీత బోధించి నరుక్కురమ్మన్నారు. ఆ భగవద్గీత బోధ లేకుండా నరికితే, లోకంలోని గొప్ప వీరులమల్లే క్రూరుడయే వాడు అర్జునుడు, ఓ చెంగిజ్‌ఖానో, తైమూర్ ఖానో అయేవాడు అతను.

*'మహాస్థాన్'(1947-59) ' లో చలం*